క్లుప్తంగా

వాగులా రోడ్డు



వాగును తలపిస్తున్న రోడ్డు

తాళ్లూరు: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీరు చేసి వాగును తలపిస్తోంది. మండల కేంద్రానికి వెళ్లే తూర్పు గంగవరం ప్రధాన రహదారి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద రోడ్డుకు గుంతలు పడటంతో వాన నీరు చేరి వాగును తలపిస్తోంది. వాహనాల రాకపోకలతో వర్షం నీరు రోడ్డు వెంబడి ఉండే ఇళ్లలోకి వెళ్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాళ్లూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గుంటి గంగమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డు మార్గం బురదమయం కావడంతో వృద్ధులు, మహిళలు జారి పడుతున్నారు. ఆయా కార్యాలయాలకు వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

కురిచేడు: దొనకొండ, కురిచేడు మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు కురిచేడులోని వాణి కళ్యాణ మండపంలో జరుగుతుందని ఆ మండలాల పార్టీ కన్వీనర్లు వైవీ సుబ్బయ్య, వెన్నపూస వెంకటరెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్శి, తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల నాయకులు, కార్యకర్తలకు దర్శి పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ రెండు సమావేశాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరవుతారని చెప్పారు. సమావేశానికి ఆయా మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పీహెచ్‌సీకి ఈసీజీ మిషన్ వితరణ



ఈసీజీ మిషన్ ఇస్తున్న బ్రహ్మారెడ్డి

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన దిరిశాల బ్రహ్మారెడ్డి తన తల్లిదండ్రులు సుబ్బిరామిరెడ్డి, అంజమ్మల జ్ఞాపకార్థం గురువారం ఇచ్చినట్లు వైద్యాధికారి సీహెచ్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇక నుంచి గుండె సంబంధిత ఈసీజీ పరీక్షలు ఆరోగ్య కేంద్రంలోనే చేయవచ్చని పేర్కొన్నారు. గుండెనొప్పితో బాధపడుతున్న వారికి నిర్ధారణ కోసం ఈ మిషను ఉపయోగపడుతుందని చెప్పారు. గుండె జబ్బులున్న వారితో పాటు గర్భిణులకు ఈసీజీ ఉపయోగపడుతుందని తెలిపారు. దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ కేపీ రాజు, హెల్త్ సూపర్‌వైజర్లు కె. అంజమ్మ, సీహెచ్ నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ కేవీ ఆనంద్, కె. సుబ్బమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా మఠం వీధి!

కొమరోలు: స్థానిక బ్రహ్మంగారి మఠం వీధి మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ వీధిలో నిత్యం మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. కొమరోలులో 2 మద్యం దుకాణాలను టెండర్ దక్కించుకున్నవారు కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిలో ఏర్పాటు చేసుకున్నారు. మందుబాబులు స్థానిక హోటళ్లు, వైన్ షాపు పక్కనే ఉన్న బ్రహ్మంగారిమఠం వీధిలో బహిరంగంగా మద్యం తాగి రచ్చ రచ్చ చేస్తున్నారు. వీరి ఆగడాలు మితిమీరుతుండటంతో స్థానిక మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం మత్తు ఎక్కువైన వారు రోడ్డు పైనే పడి పొర్లుతున్నారు. దీనితో వాహనదారులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఖాళీ మద్యం సీసాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా మారింది.

5న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర మహాసభ

మార్కాపురం టౌన్: విజయవాడలో జూన్ 5వ తేదీన నిర్వహించనున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. గురువారం మార్కాపురంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో చలో విజయవాడ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కె.చెంచిరెడ్డి, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కౌన్సిల్ మహాసభకు ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బడేసాహేబ్, కోమలి, ఖాన్, శేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు అవసరం.. ఇప్పుడు నిరుపయోగం

- రోడ్లకు అడ్డుగా మారిన టెలిఫోన్ స్తంభాలు

పెద్దదోర్నాల:

ల్యాండ్ లైన్ ఫోన్లు దాదాపుగా తగ్గిపోయి సెల్ ఫోన్ల వినియోగం పెరిగిన తర్వాత అంతకు ముందు ఏర్పాటు చేసిన టెలిఫోన్ స్తంభాలు నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని అమ్మవారిశాల వీధి, ఫారం బజార్, మసీద్ వీధి, ఇందిరా నగర్, ఫీర్ల చావిడి బజార్‌ల్లో టెలిఫోన్ స్తంభాలు సమస్యాత్మకంగా మారాయి. రెండు దశాబ్దాల క్రితం వినియోగించిన ల్యాండ్ లైన్ ఫోన్ల వినియోగానికి దాదాపుగా తెరపడింది. ఈ నేపథ్యంలో అప్పట్లో మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నో టెలిఫోన్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవి చాలా చోట్ల శిథిలమై కూలిపోయే స్థితిలో ఉన్నాయి. దీంతో పాటు టెలిఫోన్ వ్యవస్థకు సంబంధించి ఆపరేటర్లు వినియోగించేందుకు అవసరమైన నిలువెత్తు బాక్సులు సైతం పోలీస్‌స్టేషన్, అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసినా అవి ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. గతంలో రహదారులు లేని సమయంలో టెలిఫోన్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి చెంది రోడ్లు ఏర్పాటు చేశారు. చాలా చోట్ల స్తంభాలన్నీ రోడ్ల పైకి, మధ్యలో చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్నాయి. టెలిఫోన్ స్తంభాలున్న స్థలాలను కొందరు ఇళ్ల యజమానులు ఆక్రమించి తమ ఇంటి స్థలాల్లో కలిపేసుకున్నారు.



మసీదు వీధిలో నిరుపయోగంగా ఉన్న టెలిఫోన్ స్తంభం



శ్రీశైలం రహదారిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న టెలిఫోన్ స్తంభం

కేబుల్ ఆపరేటర్లకు మేలు

చాలాచోట్ల శిథిలమైన టెలిఫోన్ స్తంభాలు కేబుల్ అపరేటర్లకు తమ తీగలను కట్టుకునేందుకు ఉపయోగపడ్తున్నాయి. దీంతో ఒక్కో స్తంభానికి 20 కిపైగా కేబుళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వర్షాలు పడినప్పుడు, చెట్ల కొమ్మలు స్తంభాలపై పడి చిక్కుకుపోతున్నాయి. టెలిఫోన్ స్తంభాలు ఉన్న కేబుళ్లలో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. చాలాచోట్ల కొత్త రోడ్డు వేసేందుకు, రహదారి విస్తరణకు టెలిఫోన్ స్తంభాలతో ఆటంకాలు కలుగుతున్నాయి. దీంతో పాటు మరికొందరు ఖాళీగా ఉన్న స్తంభాల చుట్టూ చెత్త వేస్తూ ఆ ప్రాంతాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. టెలిఫోన్ స్తంభాలతో ఎదురవుతున్న సమస్యలను ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించటం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న టెలిఫోన్ స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాసాచారి

దర్శి (కురిచేడు): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ ఏడాది ప్రతిభ కనబరచిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ఇచ్చేందుకు సభ ఈ నెల 25న స్థానిక లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జరుగుతుందని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి తెలిపారు. స్థానిక బంగారమ్మ బావి గుడి వద్ద బ్రహ్మం గారి దేవస్థాన ప్రాంగణంలో ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. పదో తరగతి, ఇంటర్, ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఈటీ, ఎంబీబీఎస్‌లో సీట్లు పొందిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు అభినందన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏపీ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు, రాష్ట్ర ప్రభుత్వ బీసీ కమిషన్ సభ్యుడు కుందుర్తి గురవాచారి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, పల్నాడు జిల్లా ఏఆర్ సీఐ రాజా, పీసీ పల్లి ఎంఈఓ ఆర్.శ్రీనివాసులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. అర్హులైన 80 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విశ్వబ్రాహ్మణులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో దర్శి నాయకులు డి.రామేశ్వరాచారి, జిల్లా యూత్ అధ్యక్షుడు టి.జనార్దనాచారి, ఆర్.రాజశేఖర్, జి.కళ్యాణ్, ఆర్.బ్రహ్మం, పి.బ్రహ్మానందం, కె.విజయలక్ష్మి, సీహెచ్ చంద్రశేఖరాచారి, కె.కళావతి, టి.సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్‌లో 45 బైకులు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

దర్శి (కురిచేడు): దర్శి మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్‌లో పోలీసులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు సీజ్ చేసినట్లు సీఐ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ధృవపత్రాలతో పాటు హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో వాహనాన్ని నడపాలని, మద్యం తాగి వాహనాన్ని నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి అమ్మకాల సమాచారం ఇస్తే వారి సమాచారం గోప్యంగా ఉంచి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజైన వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లవచ్చని సీఐ వివరించారు. కార్డెన్ సెర్చ్‌లో దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు ఎస్సైలు మురళి, కమలాకర్, మల్లికార్జునరావు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



దర్శిలోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి



పెద్దదోర్నాల: ఐనముక్కలలో అన్నదానం

పెద్దారవీడు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకునే అంజనీసుతుడికి ప్రీతికరంగా భావించే హనుమాన్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో ఆంజేయస్వామి దేవాలయాలు సుందరంగా మామిడి ఆకులు, పచ్చని పందిళ్లతో అలంకరించారు. తోకపల్లి, ఎస్. కొత్తపల్లి, బద్వీడు, బద్వీడుచెర్లోపల్లి, హనుమాన్‌జంక్షన్‌కుంట, మల్లవరం, ఏనుగులదిన్నెపాడు, గొబ్బూరు తదితర గ్రామాల్లో శ్రీ ఆంజనేయస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. పెద్దారవీడులో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు మేడవరం రాఘవేంద్ర ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, నిమ్మకాయలు, తమలపాకు ఆకులు, పూలమాలలతో అలంకరించారు. ఆ తర్వాత హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదం వితరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు అందుకున్నారు. మొక్కుబడులు ఉన్న భక్తులు స్వామికి వడపప్పు, పానకం సమర్పించారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఆలయాల ప్రాంగణంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

పుల్లలచెరువు: పవన పుత్రా పాహిమాం.. పాహిమాం..అంటూ గురువారం ఆంజనేయస్వామి ఆలయాల మార్మోగాయి. హనుమత్ జయంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుల్లలచెరువులో భక్తుడు వేముల గాలెయ్య ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో హనుమాన్ శోభాయాత్రను పురవీధుల నుంచి భక్తి పాటలు పాడుకుంటూ వైభవంగా నిర్వహించారు. అనంతరం చౌటపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజారి ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఉమ్మడివరంలోని ఆలయంలో పూజారి శంకర్‌స్వామి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కమిటీ వారు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు. వినయ సంపన్నుడు, వృత్తి ధర్మపరుడు, ఆంజనేయుడు అనే పరమాత్మని పూజించిన వారికి మనోధైర్యం సిద్ధిస్తుంది. బుద్ధిబలం, యశస్సు చేకూరి ఆయురారోగ్యాలు కలిగి ఉండటంతో పాటు అవివాహితులకు వివాహ యోగం, నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. హనుమంతుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించే భక్తులకు శని, దుష్ట గ్రహాలు దరిచేరవని శాస్త్రం చెబుతోంది. మండల పరిధిలోని ఐనముక్కలలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో ఆకుపూజ, నవగ్రహ, సుబ్రహ్మణ్యం, లక్ష్మీగణపతి, రుద్ర, పూర్ణాహుతి, మహారుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీగా అన్నదానం చేశారు.



కాటంవారిపల్లెలో శాంతి కళ్యాణం

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం, తూర్పు గంగవరం ప్రసన్నాంజనేయ స్వామి, సోమవర్పాడు వీరాంజనేయ స్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పూజారులు స్వామి వారికి సింధూరం, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి పానకం, వడపప్పు, పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. పూజ అనంతరం పలు గ్రామాల్లో అన్నదానం చేశారు.

దర్శి (కురిచేడు): హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గురువారం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్శిలోని సువర్చలాసమేత శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, కురిచేడు కొనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి, బోధనంపాడులోని సువర్చలాసమేత ప్రసన్నాంజనేయస్వామి, కాటంవారిపల్లెలో వేంచేసి ఉన్న సువర్చలాసమేత అభయాంజనేయస్వామి, ఆవులమంద రోడ్డులో రామాంజనేయ కాలనీ సమీపంలో వేంచేసి ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆకుపూజ, శాంతి కళ్యాణం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు.

త్రిపురాంతకం: హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. త్రిపురాంతకంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, అభయ ఆంజనేయ స్వామి ఆలయం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, పాటిమీద ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆకుపూజ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఆలయాల వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు.



వీరాంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



తోకపల్లిలో భక్తులకు అన్నదానం



పుల్లలచెరువు: హనుమాన్ శోభాయాత్ర



పుల్లలచెరువు: ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..

మార్జిన్లతో వాహనదారుల కష్టాలు



పుచ్చకాయలపల్లి సమీపంలో కొండపై తారు రోడ్డు మార్జిన్ ఇలా..

పెద్దారవీడు: మండలంలో పుచ్చకాయలపల్లి నుంచి సుంకేసుల గ్రామాల మధ్య కొండపై తారు రోడ్డు నిర్మించి రెండు నెలలు దాటినా మార్జిన్లకు బెరమ్స్ వేయక పోవడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో అక్కడక్కడా గుంతలు ఉండటంతో నూతనంగా తారు రోడ్డు వేశారు. మార్కాపురం నుంచి పుచ్చకాయలపల్లి మీదుగా సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాలకు నిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. కొండపై వేసిన తారు రోడ్డు ఎత్తుగా ఉండి మార్జిన్లు లోతుగా ఉండటంతో ఎదరుగా వచ్చే వాహనాలను పక్కకు తప్పించేందుకు ఇబ్బందిగా ఉంటుందని డ్రైవర్లు వాపోతున్నారు. కొండపైకి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు వాహనాలు ఎదురుగా వస్తే మార్జిన్లు లోతుగా ఉండటంతో వాహనాలు పక్కకు దిగాలంటే భయం భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట ఎదురుగా వచ్చే వాహనాల కోసం రోడ్డు మార్జిన్ దిగాలంటే డ్రైవర్లు భయందోళన చెందుతున్నారు. రోడ్డు మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మార్జిన్ రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లకు మట్టి తోలకుండా వదిలేసిన కాంట్రాక్టర్, అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తారు రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లకు మట్టి తోలి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సుంకేసుల వెళ్లే రోడ్డు మలుపు వద్ద కనిపించని హెచ్చరిక బోర్డు

పుల్లలచెరువును తాకిన మేఘమాల

పుల్లలచెరువు: నాలుగు రోజులుగా రోజూ సాయంత్రం వర్షం పడుతుండటంతో పుల్లలచెరువు కొండల పరిసర ప్రాంతాలు పచ్చదనంతో అందాలను సంతరించుకున్నాయి. గురువారం ఉదయం వాతావరణం చల్లబడటంతో పుల్లలచెరువు సమీపంలోని ఎతైన కొండలపై మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. దీంతో ఆ పరిసరాల ఆహ్లాదంగా మారాయి. పుల్లలచెరువును మేఘం తాకిందా అన్నట్లుగా ఉండటంతో ప్రకృతి ప్రేమికులు ఎంజాయి చేశారు.



పుల్లలచెరువును తాకిన మేఘాలు